నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | ఆగస్టు 08, 2024 | www.navatelangana.com

పంటల వివరాలు నమోదు తప్పనిసరి


పంటను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నందిపేట్

డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్ గ్రామంలో వ్యవసాయ అధికారులు ఫోన్‌లో పంటల వివరాలు నమోదు చేసి వివరాలను సిఅండ్ఇఆప్ ద్వారా బుధవారం పరిశీలించారు. రైతులు ఏఏ పంటలు పండిస్తున్నారో తెలుసుకొని పంట వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా సర్వే నెంబర్లలో పంట వివరాలు నమోదు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి వాజీ హుస్సేన్ తెలిపారు. ఆలస్యం చేయకుండా పంట వివరాలు ఫోన్‌లో నమోదు చేయాలని ఏఈఓలను ఆదేశించారు. ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి, జోస్నా భవాని, వ్యవసాయ విస్తరణ అధికారి, మౌనిక, విజయ్ లు ఉన్నారు.

సాగుకు ఎస్సారెస్పీ నీటివిడుదల

- కాలువలకు నీటిని విడుదల చేసిన బాల్కొండ, నిర్మల్ ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-ముప్కాల్

ఎస్సారెస్పీ నుంచి సాగుకోసం నీటిని బుధవారం విడుదల చేశారు. ప్రాజెక్టు ప్రధాన కాలువలైన కాకతీయ కాలువకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రాజెక్ట్ నుండి లక్ష్మీ లిఫ్ట్ ద్వారా లక్ష్మీ కాలువతో పాటు కాకతీయ కాలువలకు నీటిని విడుదల చేయగా, సరస్వతీ కాలువలకు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మోటార్ ఆన్ చేసి నీటిని కాలువలోకి విడుదల చేశారు.

వివరాలు మెయిన్‌లో..


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

జీపీ కార్మికులకు
ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- నేడు ఒక్కరోజు సమ్మెను జయప్రదం చేయాలి
- గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)
- జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామ పంచాయతీ వర్కర్స్ కు పర్మినెంట్ చేసి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు ప్రభుత్వం వచ్చి 7 నెలలు కావస్తున్నా గ్రామ పంచాయతీ కార్మికులను పట్టించు కోవడం లేదని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్ అన్నారు.ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 8వ తేదీన (నేడు) ఒక్క రోజు సమ్మె చేపడుతున్నామని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకపోతే గ్రామ పంచాయతీ కార్మికుల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బాలనర్సు,రాజన్న, మల్లేష్, శ్యాం, స్వామి తదితరులు పాల్గొన్నారు.


చదును చేస్తున్న జేసీబీ

రోడ్డు విస్తరణలో
పోచారం ప్రాజెక్టు బండ్ ధ్వంసం

- అవసరంలేకున్నా చెట్లూ నరికేశారు
- ఇరిగేషన్ డిఈఈ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మెదక్ టు రుద్రూర్ రోడ్డు నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తున్న సంబంధిత కాంట్రాక్టర్లు , అధికారులు.. అనుమతి లేకుండానే పోచారం ప్రాజెక్టు బండ్ ధ్వంసం చేసినట్టు ఇరిగేషన్ డిఈఈ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. పోచారం ప్రాజెక్టు ఆవరణలో తమ పరిధిలో ఉన్న పోచారం ఆయకట్ట దానికి సంబంధించిన అలాట్‌మెంట్‌లో లేకున్నా సదరు కాంట్రాక్టర్ చెట్లు నరకివేశారని తెలిపారు. పోచారం ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసే గేట్ల వద్ద ఉన్న 100 సంవత్సరాల క్రితం పెట్టిన చెట్లను నరికి వేయడం సరికాదని అన్నారు. రోడ్డు విస్తరణకు ఈ చెట్లకు అసలు సంబంధం లేదని వెల్లడించారు. ప్రాజెక్టు సమీపాన ఉన్న పోచారం గ్రామానికి ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రాజెక్టును ఏమాత్రం డిస్టర్బ్ చేయకుండా రోడ్డు నిర్మించాలని సూచించారు. కొందరు అధికారులు తమకు చెప్పకుండానే ప్రాజెక్టు బండ్ ధ్వంసం చేయడం కరెక్ట్ కాదని ఆయన పేర్కొన్నారు. ఒకసారిగా వర్షాలు కురిస్తే నీరంతా గ్రామంలోకి చేరే అవకాశాలు ఉంటుందని బండ్ ధ్వంసం చేయడం కరెక్ట్ కాదని తెలిపారు. ఈ విషయం తమ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.


ఆత్మహత్యకు యత్నించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని పరామర్శించిన పలువురు నాయకులు

పర్మినెంట్ చేస్తారని భావిస్తే తొలగిస్తారా..?

- ఆత్మహత్యకు యత్నించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి పరామర్శ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగిని ఇటీవల విధుల నుండి తొలగించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి చిన్న సాయిలును బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ పార్టీల నాయకులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు మాట్లాడుతూ ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మాలి పోస్టులో అపాయింట్మెంట్ తీసుకుని సుమారు 12 సంవత్సరాల నుండి ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తూ చాలీచాలని వేతనంతో చిన్న సాయిలు విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. తన ఉద్యోగం ఎప్పటికైనా పర్మినెంట్ అవుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నాడని, ఇటీవల ఆయనను విధుల నుండి తొలగించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడడం ఎంతో బాధాకరమన్నారు. ప్రభుత్వం అవుట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ఎన్నో ఆశలు ప్రేరేపించి వారి జీవితాలతో చెలగాటం ఆడడం చాలా దారుణమని మండిపడ్డారు. జిల్లా అధికారులు నిర్లక్ష్యం వహించకుండా అతనిని వెంటనే ఉద్యోగంలోకి తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారికి ఉద్యోగ భద్రత కల్పించి వారి జీవితాలు రోడ్డున పడకుండా చూడాలని కోరారు.

ఒక దళితుడు అధికారుల నిర్లక్ష్యానికి బలైతే సహించబోమని, రాష్ట్రవ్యాప్తంగా ఏకమై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మర్లు సాయిబాబ ఎంఐఎం పార్టీ నాయకులు రజాక్ అంబేద్కర్ సంఘ నాయకులు చర్ల సాయిలు తదితరులు ఉన్నారు.

అధికారుల తప్పిదం
రుణమాఫీకి రైతులు దూరం

- 72 మంది రైతుల పేర్లు గల్లంతు
- సిబ్బంది తీరుపై రైతుల ఆగ్రహం



నవతెలంగాణ-లింగంపేట్

అధికారుల తప్పిదనం వల్ల పలువురు రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. రుణ మాఫీలో భాగంగా రెండో విడుత ఇటీవల మాఫీ చేసిన విషయం విధితమే. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 39 సొసైటీల పరిధిలో సిబ్బంది తప్పిదనం వల్ల సుమారు 1700 వందల మంది రైతులు రుణమాఫీకి నోచుకోలేనట్టు సమాచారం.అయితే లింగంపేట్ సహకార సంఘం పరిధిలో 73 మంది రుణమాఫీకి దూరమైయ్యారు.

లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 1559 రైతులు రుణమాఫీకి అర్హులుగా ఉన్నారు. ఇందులో మొదటి విడత 513 మంది రైతు లకు లక్షల్లోపు రుణమాఫీ వచ్చింది. అదేవిధంగా రెం డో విడత 1 లక్ష యాభై వేలు 100 రైతులకు రుణ మాఫీ వచ్చింది. ఇదిలా ఉండగా 73 మంది రైతులకు రుణమాఫీ జాబితాలో పేర్లు లేకపో వడంతో వారి పేర్లు గల్లంతు అయినాయి. రైతుల పే ర్లు ఆన్‌లైన్‌లో ఎంట్రీలో నమోదు చేయడంలో నిర్ల క్ష్యం చేయడం వల్ల రుణమాఫీకి అర్హత కోల్పోతు న్నారు. లింగంపేట్ సింగిల్ విండో సిబ్బంది 73 మంది రైతులకు 49 లక్షల 68,500 పంట రుణాలు 30-9-2023 నుండి మూడు నెలలపాటు పంట రుణాలు ఇచ్చింది. కానీ ఆన్లైన్ లో మాత్రం పేర్లు నమోదు చేయడంలో 13-2-2024 నమోదు చేయడంతో రుణమాఫీగా అర్హత కోల్పోయారు.

లింగంపేట్ మండలంలోని బోనాలు గ్రామానికి చెందిన కురుమ సాయిలు రైతు ఎస్ డి సి సి బి బ్యాంక్ ఖాతా నెంబర్ 18332204001584 నాలుగు ఎకరాల భూమి లో పంట సాగు చేయడంతో 1 లక్ష 50 రూపాయలు 20-10-23 తేదీనాడు పంట రుణం తీసుకున్నాడు. సదర్ రైతు పేరు ఆన్‌లైన్‌లో సకాలంలో నమోదు చేయకపోవడంతో రుణమాఫీ కోల్పోయారు.

ప్రభుత్వం 31-12-2018 నుండి డిసెంబర్ 9-12-2023 వరకు రుణమాఫీ అర్హులుగా ప్రకటించింది. డిసెంబర్ 21-2023 నుండి 13-12-2023 సింగిల్ విండో సిబ్బంది పేరు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో రైతులు పంట రుణం తీసుకున్న కటాఫ్ డేట్ ముందు ఆన్లైన్లో నమోదు చేయకపోవడంతో అధికారుల చుట్టూబ్యాంకర్ల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. రుణమాఫీ చేయాలని మొరపెట్టుకుంటున్నారు. గత వారం రోజులు క్రితం రుణమాఫీ కానీ రైతులు సింగిల్ విండో కార్యదర్శిని సిబ్బంది తీరుపై మండిపడ్డారు. ఎందుకు ఆన్లైన్లో నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారికి రుణమాఫీ చేయాలని వినతిపత్రం అందజేశారు.

సిబ్బంది నిర్లక్ష్యం చేశారు



సింగిల్ విండోలో నాలుగు ఎకరాల పంట రుణం 1 లక్ష 50 రూపాయలు తీసుకున్నా. ఆన్‌లైన్ లో తీసుకున్న తేదీ నమోదు చేయ లేదు. సిబ్బంది నిర్లక్ష్యం చేశారని ఆయన మండిప డ్డారు. రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కురుమ సాయిలు. బోనాలు

మాఫి కాల్ లేదని చెప్తుండు



బ్యాంకు చుట్టూ తిరిగినా బ్యాంకు సిబ్బంది మాఫీ కాలేదంటున్నారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ.85 వేలు రుణం తీసుకున్నా. రుణమాఫీలో పేరు రాలేదు.

సున్నం పర్వయ్య. అయ్యపల్లి

ఉన్నతాధికారులకు నివేదిక అందించాం

సందీప్. సింగిల్ విండో కార్యదర్శి

73 మంది రైతులకు రుణమాఫీ కానిది వాస్తవమే. వారు ముందస్తు రుణాలు తీసుకున్న ఆలస్యంగా నమోదుతో రుణమాఫీకి అర్హత కోల్పోయారు. ఆ వివరాలు ఉన్నత అధికారులకు అందించాము.

ప్రజల భాగస్వామ్యంతో
స్వచ్ఛ, పచ్చదనం సాధ్యం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-దోమకొండ

స్వచ్ఛధనం - పచ్చధనం కార్యక్రమంలో అందరు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వన్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా దోమకొండ మండల కేంద్రం తో పాటు లింగుపల్లి, సంగమేశ్వర్ గ్రామలలో స్వచ్ఛధనం,పచ్చధనం కార్యక్రమం లో భాగంగా బుధవారం సందర్శించి, దోమకొండ మండల కేంద్రంలో చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత సహకార సంఘం ఆధ్వర్యం లో జెండావిష్కరణ చేసి,ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం బీసీ హాస్టల్,ఐ సిడిఎస్ మరియు పశు వైద్యశాలలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛ ధనం కార్యక్రమంలో పాల్గొని అనంతరం ఏంఎల్ఎస్ పాయింట్ లో పీడీయస్ స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అశీష్ సంగ్వన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛ ధనం పచ్చధనం కార్యక్రమం లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకం లో పనులు త్వరగా పూర్తి చేయాలనీ అధికారులకు సూచించారు. వీధి నిర్వహణ లలో నిర్లక్ష్యం వహించుతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎస్సీ హాస్టల్ వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటీ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థు లకు బహుమ తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారి సురేందర్ , జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, డి ఎల్ పి వో వెంకట శ్రీనివాస్ , మండల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహశీల్దార్ సంజయ్ రావు,మాజీ జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డును మంజూరు చేయండి

- మున్సిపల్ కమిషనర్‌ను, ఎమ్మెల్యేను కలిసిన రోటరీనగర్ వాసులు


వినతిపత్రం అందజేసిన కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే..


మున్సిపల్ కమిషనర్‌కు విన్నవిస్తున్న కాలనీవాసులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తమ కాలనీలో మట్టి రోడ్లే ఉండటం వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా గుంతలమయంగా, బురదగా మారి ప్రమాదాల బారినపడుతున్నామని, రోడ్డు వేయించాలని 7వ డివిజన్‌లోని రోటరీనగర్ రోడ్ నెం.6 వాసులు కోరారు. బుధవారం పలువురు కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ మకరంద్‌తో పాటు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను కలిసి విన్నవించు కున్నారు. రోడ్డు మొత్తం బురదగా, చిత్తడిగా మారడంతో బైక్‌లపై వెళ్లేప్పుడు, నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో జారిపడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు నడుచుకుంటూ వెళ్లలేకపోతున్నారని, పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్తి తీసుకొస్తున్న క్రమంలో అనేక ఇక్కట్లు పడుతున్నామని వాపోయారు. బైక్‌లపై వస్తున్న క్రమంలో బురదలో టైర్ ఇరుక్కుపో తోందని, దీంతో స్కిడ్ అయి పడిపోతున్నామని కాలనీవాసులు తెలిపారు. వర్షాకాలంలో బీటీ ప్లాంట్ మూసివేసి ఉంటుందని, నెలన్నర తర్వాత తెరుచుకోనుందని, ఆ సమయంలో మొదటి ప్రియారిటీగా రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు తాత్కాలిక మరమ్మతుగా మొరం వేయించి చదును చేస్తామని తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను కలవగా.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని, ఈ విషయమై ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించి, సీఎంను కలిసినట్టు గుర్తు చేశారు. నగరంలో 6,7,8 డివిజన్‌లలో రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. రెండు నెలల్లో రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతలోగా మొరం వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీవాసులు మీసమధు, రవి, భాస్కర్, ప్రణయ్, శివకుమార్, శ్రీనివాస్, నితిన్, సత్యనారాయణరావు, సుజాత, మంజుల, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నల్లా బ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన

- ప్రత్యేక న్యాయవాద వృత్తి రక్షణ చట్టం ఏర్పాటుకు డిమాండ్


నిరసన చేస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జనగాం న్యాయవాది దంపతులు గద్దల అమత రావు, గద్దల కవితా రావులపై పోలీసుల దాడి నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపుమేరకు బుధవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై జిల్లా కోర్టు ప్రధాన గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నిరసన ఉద్దేశించి నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో కేసుల వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన న్యాయవాదులపై పోలీసులు దాడి చేయడం హేమమైన చర్యని అందుకు బాధ్యులైన పోలీస్ అధికారులు సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌లను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలన్నారు. సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా సిద్దిపేట, కొత్తగూడెం, భద్రాచలం, సిరిసిల్ల జిల్లాల్లో న్యాయవాదులపై పోలీసులు దాడి చేయడం అక్రమ కేసులు మరణించడం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహించడం శోచనీయమని తెలిపారు. న్యాయవాదులకే రాష్ట్రంలో రక్షణ కరువైందని రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల దాడిలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిపించాలని బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి, ఇలాంటి చర్యలు పునరావతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.రాజు, ప్రధాన కార్యదర్శి వసంతరావు, లైబ్రరీ కార్యదర్శి పిల్లి.శ్రీకాంత్, న్యాయవాదులు ధోన్పాల్ సురేష్, నరేందర్‌రెడ్డి, పరుచూరి శ్రీధర్, బిట్ల రవి నారాయణ, పులి జైపాల్, పుణ్య రాజ్, గోవర్ధన్, సత్యనారాయణ గౌడ్, హనుమంత్ రెడ్డి, గణేష్, బిక్షపతి, చెన్నా నాయక్, అంజలి, మాణిక్ రాజ్, ఆశా, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు



నవతెలంగాణ-బిచ్కుంద

రైతుల పట్ల ప్రజా ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తోందని రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పంద్రాగష్టు లోపు రెండు లక్షల లోపు ఉన్న రైతుల రుణాలు అన్నీ మాఫీ చేస్తున్నామని రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని బండాయప్పా కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతీ ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రాల కు అధికారాలు ఇస్తూ సుప్రీంకోర్టులో తీర్పు వచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం అమలు పరుస్తుందని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు, విద్యా వైద్యం, వ్యవసాయం మెరుగుపరచడమే తన ప్రాథమిక లక్ష్యమని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల లో జుక్కల్ నియోజకవర్గానికి చెందిన ప్రతిభ అనే క్రీడాకా రిణికి ప్రోత్సాహం అందిచాలని అసెంబ్లీలో తాను ప్రసం గించిన విషయాన్ని గుర్తు చేస్తూ జుక్కల్ నియోజకవర్గంలో ఎటువంటి క్రీడా సౌకర్యాలు లేవనే అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లానని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున అప్ప, పిసిసి డెలికేట్ విట్టల్ రెడ్డి, మాజీ డిసిసిబీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీడిఎస్ బియ్యం విక్రయదారులపై చర్యలు

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

పీడీఎస్ బియ్యం విక్రేతలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ కు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సంధర్బంగ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి నిరుపేదల సౌకర్యార్థం పిడిఎస్ బియ్యాన్ని ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. కానీ కొందరు అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లర్లు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం అందిందని వెల్లడించారు. కోటగిరి మండలంలో రెండు రైస్ మిల్లులలో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని ఎసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి 4 లారీలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించే వారు ఎంతటి వారైనా సరే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పిడిఎస్ బియ్యం నీటిలో వేసి చూస్తే వాటి రంగు ఏర్పడుతుందని, తక్షణమే దానెని గుర్తించవచ్చని సూచించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ బియ్యం నిల్వలపై చర్యలు తీసుకుంటూ ఉండాలని పోలీసు,రెవెన్యూ అధికారులను

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-మోర్తాడ్

మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడనే విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్చార్జి సునీల్ రెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత కమ్మరి మల్లేష్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకొని వైద్య పరీక్ష నిమిత్తం ఐదువేల రూపాయలను అందివ్వగా పార్టీ నాయకులు బాధితుడికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట శ్రీనివాస్, అశోక్, సురేష్, కృష్ణ గౌడ్, సాయి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ- నవీపేట్

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మందకృష్ణ మాదిగ, నరేంద్ర మోడీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జజ మాదిగ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ రెండు నిమి షాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బోధన్ కోఆర్డినేటర్ మానికోల్ల గంగాధర్, గోపి, జీవన్, బందెల చిరంజీవి, పోశెట్టి, సావిత్రి, మోహన్, కిషన్, గంగాధర్, విజయ్, నర్సింహులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

లేగ దూడపై చిరుత పంజా

- భయాందోళనలో గ్రామస్తులు, రైతులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

లేగదూడపై చిరుతపులి పంజా విసిరింది. ఈ దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఇందల్ వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్ తెలిపిన వివరాల ప్రకారం ఇందల్ వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని యానంపల్లి గ్రామ శివారులో తోట మనోజ్ కుమార్‌కు చెందిన పశువుల కొట్టంలో లేగ దూడ పై మంగళవారం తెల్లవారు జామున చిరుత పులి దాడి లేగ దూడను చంపి వేసిందన్నారు. ఉదయం కొట్టం వద్దకు వెళ్లిన మనోజ్ కుమార్ చూసేసరికి లేగదూడ కళేబరం ఉండడంతో యజమాని వెంటనే అటవీ సెక్షన్,బీట్ అధికారులు వినయ్, శ్రీకాంత్‌కు వివరించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నిశితంగా పరిశీలించారు. ఈ విషయమై ఇందల్ వాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ భట్ మాట్లాడుతూ చిరుత దాడి చేసినట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. లేగ దూడ మృతి విషయమై కేసు నమోదు చేసుకున్నామని, ప్రభుత్వం నుండి నష్టపరిహారాన్ని అందించే విధంగా చూస్తానని ఆయన వివరించారు. కాగా చిరుత సంచరిస్తున్న వార్తతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. దాని అనవాళ్లు కనబడ్డ వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందజేయాలని ప్రజలకు, రైతులకు సూచించారు.



యువత దేశ రక్షణ దళంలో చేరడం అభినందనీయం



విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-సిరికొండ

భారత దేశ రక్షణదళంలో చేరుటకు యువత ముందుకు రావడం అభినందనీయమని, నేటి యువతే దేశ భవితకు పునాది అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. ఇటీవల భారత రక్షణ నౌకదళంలో ఉద్యోగం సాధించి శిక్షణ పూర్తిచేసుకున్న సత్య శోధక్ పాఠశాల పూర్వ విద్యార్థి మిద్దెల నితిన్‌కు బుధవారం పాఠశాలలో ప్రత్యేక జ్ఞాపికను అందించి సత్కరంచారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. జాతీయత భావం పెంపొందించుకుని సమాజంలో ఆదర్శ ప్రాయమైన పౌరులుగా ఎదగాలని, విద్యార్థి దశలో మంచి లక్ష్యంతో ఉత్తమ నడవడికను అలవరుచుకొని శ్రమిస్తే ఉన్నత స్థాయిలో స్థిరపడి సమాజంలో ఆదర్శ పౌరులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, రవీందర్, సతీష్,రాజు, సతీష్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో గల సొసైటీలో రుణమాఫీ జరిగి మళ్ళీ రుణాలు తీసుకుంటున్న వారికి చెక్కులను చైర్మన్ గంగారెడ్డి బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలోగల రుణమాఫీ జరిగిన రైతులకు తిరిగి రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. రుణమాఫీ చేసినందుకు రైతుల తరఫున ముఖ్యమంత్రికి. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సొసైటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఉమాపతిరావు, వైస్ చైర్మన్ తిరుపతి డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, నరేందర్, సీఈఓ సాయిచంద్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన నోడల్ అధికారి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న నోడల్ అధికారి రవీందర్‌రావు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల నోడల్ అధికారి రవీందర్‌రావు పరిశీలించినట్లు ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్ తెలిపారు. ఇంగ్లీష్ సబ్జెక్టు నందు విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల చురుకుదనం ప్రదర్శించడం పట్ల నోడల్ ఆఫీసర్ రవీందర్‌రావు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, గంగా ప్రసాద్, లలిత పాల్గొన్నారు.

అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర నేసిన ఘనత చేనేతలది

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అగ్గిపెట్టెల్లో పట్టే పట్టుచీరలు నేసిన ఘనత మన చేనేత కార్మికులదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేనేత కార్మికుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేతని అన్నారు. గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడకడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, విదేశీ వస్తువుల బహిష్కరించి స్వదేశీ వస్తువుల వాడకంలో కూడా చేనేత కార్మికులు ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక నరేంద్ర మోడీ స్వదేశీ వస్తుల వాడకంపై ప్రతేక దృష్టిపెట్టి వారిని ప్రోత్సాహించే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. 2015, ఆగస్టు 7న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో భారతదేశ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రారంభించి, భారత చేనేత లోగోను ఆవిష్కరించడంతోపాటూ ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని అన్నారు. ఆ సందర్భంగా 2012-14 సంవత్సరాల్లో చేనేత రంగంలో ప్రతిభ కనబరిచిన 72మందికి అవార్డులు (వీరిలో 16 మందికి సంత్ కబీర్ పురస్కారాలు) ప్రదానం చేయడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరుతో చేనేతలకు పని కల్పిస్తామని మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అయినా చేనేతలకు చేతినిండా పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులకు తను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీనిచ్చారు. అనంతరం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిజామాబాదు అర్బన్‌లో ఉన్న చేనేత మహిళా కార్మికులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో సభ అధ్యక్షులు ఓబీసీ, మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరు నాగరాజు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, మేక విజయగారు, జెడ్పిటిసి రెంజల్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మి నారాయణ, చేనేత సహకార సంఘం అధ్యక్షులు రామ కృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాస్టర్ శంకర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రచ్చ సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షులు ఇప్పకాయల కిషోర్, చేనేత సహకార సంఘము ఉపాధ్యక్షులు ఎస్.ఆర్. సత్య పాల్, ఓబీసీ మోర్చా అసంబ్లీ కన్వీనర్ గిరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

నగర పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..

చేనేత కార్మికులు, నగర 67 తర్ప సంఘాలు అధ్యక్షులు. మహిళా కమిటీ సభ్యులు, మందిరం కమిటీ సభ్యులు, భజన మండలి, జిల్లా నగర యువజన కమిటీ సభ్యులకు బుధవారం ఆత్మీయ సన్మానం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి శాఖ చైర్మన్ మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ పద్మశాలి చేతుల మీదుగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గుజ్జెటి వెంకట్ నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళి, ఉపాధ్యక్షులు అవధూత దశరథం, వెంకట్ నర్సయ్య, కైరంకొండ విట్టల్, గుండయ్య మోహన్, నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు దీకొండ యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ పులుగం హన్మాండ్లు, నగర పెద్దలు, ప్రముఖులు, తర్ప సంఘాలు అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం

ఆర్మూర్: జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా నియోజక వర్గ పద్మశాలి సంఘం తరపున చేనేత కార్మిక సంఘంలో గల చేనేత కార్మికులను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నియోజక వర్గ అధ్యక్షులు దాసరి సునీల్ కుమార్ పట్టణ అధ్యక్షులు గుజ్జెటి. రాము, చెల్మెల రాజేందర్, వంగా వివేకానంద్, చిట్ల యజ్ఞేష్, రాక్షీ రమేష్, సైభ సుధాకర్, గంగామోహన్, రాంచందర్, మేకల మోహన్, కుల సభ్యులు పాల్గొన్నారు.

పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

చేనేత సంఘంలో చేనేత కార్మికులను పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షులు అంబల్ల శ్రీనివాస్ మాట్లడుతూ చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వము తరపున 5లక్షల బీమా, వడ్డీ లేని రుణాన్ని ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తర్ప అధ్యక్షులు నూకల నారాయణ, బండి అనంత రావు, రుద్ర రాజేశ్వర్, సైబ సుధాకర్, సదమస్తుల గణపతి, పట్టణ కోశాధికారి కొక్కుల రవి, ఉపాధ్యక్షులు గురుడు రాంచందర్, సహాయ కార్యదర్శి గుజ్జెటి మహేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ: చేనేత కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



ఆర్మూర్‌లో..

తల్లిపాలు బిడ్డకు సంజీవని

- హెల్త్ సూపర్వైజర్ స్వరూప

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తల్లిపాల వల్ల బిడ్డకు ఎన్నో లాభాలు ఉంటాయని హెల్త్ సూపర్వైజర్ స్వరూప అన్నారు. బుధవారం మండలంలోని కొన సముందర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణి స్త్రీలు, బాలింతలకు ముర్రుపాల విశిష్టత, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటిదని, బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు సంజీవనిల పనిచేస్తాయని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు మురుపాలు పట్టడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి తల్లిపాలు చాలా కీలకమన్నారు. ఆరు నెలల వరకు బిడ్డ శారీరక అవసరాలన్నీ తల్లిపాలతోనే తీరుతాయన్నారు. పోత పాల కన్నా తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా ఉంటారన్నారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, రోగనిరోధక శక్తిని పొందాలంటే తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలతో బిడ్డకు, తల్లికి లాభాలు ఉన్నాయని తెలిపారు. బిడ్డకు పాలు పట్టడం ద్వారా ఎన్నో రకాల వ్యాధుల నివారణకు దోహదపడు తుందన్నారు. ముర్రుపాల ప్రాముఖ్యత, బిడ్డకు ఎంత వయసు వచ్చే వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వాలి, రోజుకు ఎన్నిసార్లు పాలు పట్టాలనే తదితరు అంశాలపై గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రూప, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, పుష్ప, ఆయాలు శారదా, లావణ్య, గ్రామ మహిళ సమైక్య అధ్యక్షురాలు మౌనిక, నడుకుడ మేఘన, కోశాధికారి యాట లక్ష్మి, కార్యదర్శి లాడే లత, వివోఏ లత, ఆశా కార్యకర్తలు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

మోపాల్: మండల కేంద్రంలో గల అంగన్వాడి సెంటర్ లో బుధవారం రోజున తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించాలని అన్నారు. ఈ ముర్రు పాలు తాగించడం వల్ల చిన్న పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ఆరు నెలల వరకు ఖచ్చితంగా తల్లిపాలు పట్టించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు జాకీర, స్వరూప, అంగన్వాడి టీచర్లు రాజ్యలక్ష్మి, శ్యామల, దీపిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

చిక్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష, ప్రతి ఒక్కరు తల్లిపాలు మాత్రమే తాగించాలని వారు కోరారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల సంఖ్య పెంచాలని అంగన్వాడి సిబ్బంది సూచించారు. శిశువు సంపూర్ణ మానసిక వికాసానికి రెండేళ్ల వయసు వచ్చేవరకు తల్లిపాలు తాగించవచ్చని వైద్య సిబ్బంది రేణుక సూచించారు. గర్భిణిగా ఉన్నప్పుడు, ప్రసవించిన తర్వాత కూడా పోషక ఆహారాన్ని తల్లులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ అనిల్, వైద్య సిబ్బంది రేణుక, సూపర్వైజర్ సుధాకర్, సీసీ కామాక్షి, సిపి జానా బాయ్, అంగన్వాడి సిబ్బంది సమంత, సుభాషిని, పంచాయతీ సెక్రెటరీ నవీన్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అరోగ్య కార్యకర్త సుజాత

డిచ్‌పల్లి: 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించడం వల్ల శిశువుకు శారీరక పుష్టి మాత్రమే కాక తల్లితో అనుబంధం ఏర్పడుతుందని సుజాత సూచించారు. బుధవారం మండలంలోని రాంపూర్ డి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరోగ్య కార్యకర్త సుజాత మాట్లాడుతూ.. వేసవి కాలంలో తల్లిపాలలో శిశువుకు కావలసినంత నీరు, పుష్టి కలిగించే పదార్థాలు ఉంటాయని, అందువల్ల తల్లి శిశువుకు విడిగా నీరు తాగించ వలసిన అవసరం లేదన్నారు. తల్లిపాలలో ఉన్న ఇమ్యునోగ్లోబిన్ యాంటీబాడీస్ వల్లే పనిచేసి శిశువుకు రోగాలతో పోరాడే శక్తి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు స్వర్ణలత, ఎంఎల్ హెచ్‌పి రేణుక, అంగన్వాడీ టీచర్లు గంగమని, అంజమ్మ, కావేరి, లలిత, ఖాతిజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి: మాట్లాడుతున్న హెల్త్ సూపర్వైజర్ స్వరూప

అమ్రాద్ తండాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని అమ్రాద్ తండాలో ప్రపంచ ఆదివాసి పోరాట దినోత్సవం సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ అధ్వర్యంలో బుదవారం నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి దుడ్డు గంగాధర్ హాజరై మాట్లాడుతూ ఖనిజ దోపిడి కోసం అడవుల నుండి ఆదివాసులను వెళ్ళగొట్టే ప్రభుత్వ కుట్రలను ఖండించాలని, ఆదివాసి సంపదను అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం చేపట్టిన షెడ్యూల్ ప్రాంత చట్ట సవరణలను ప్రతిఘటించాలని అన్నారు. అటవీ చట్టాలను గిరిజనులను హక్కులను నీరుగార్చే అటవీ హక్కుల సంరక్షణ నియమాల సవరణను ప్రతిఘటించాలని, అటవీ హక్కుల గుర్తింపు చట్టం అటవీ సంరక్షణ చట్టం 1/70 తదితర షెడ్యూల్ ప్రాంతాల రక్షణ చట్టాలకు చేస్తున్న సవరణలను వెనుకకు తీసుకోవాలని, కార్పొరేట్ కంపెనీలకు షెడ్యూల్ ప్రాంతాల్లోని లక్షల ఎకరాల పోడు భూములను ఖనిజ సంపదను కట్టబెట్టే మోడీ ప్రభుత్వం చర్యలను ప్రతిఘటించాలని తెలిపారు. పోడు భూముల పట్టాల కోసం పెట్టిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని, పోడు వ్యవసాయ భూములకు రైతు భరోసా పథకం వర్తింపజేయాలని, ఆదివాసులపై అక్రమంగా పెట్టిన అన్ని రకాల కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తండా వాసులు పాల్గొన్నరు.

వైద్య ఆరోగ్య కేంద్రం కోసం భూ సర్వే

నవతెలంగాణ-ముప్కాల్

మండలానికి నూతనంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం మంజూరు కావడంతో బుధవారం రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మండల కేంద్రంలో వివిధ సర్వే నెంబర్లను గుర్తించి నూతన ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంకు ఉపయోగపడే విధంగా దాదాపు 2 నుంచి 2.20 ఎకరాల భూమిని పరిశీలించి వీలైనంత త్వరగా జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను పంపడం జరుగుతుందని తహశీల్దార్ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్ రవి, సర్వేయర్ అంజలి, రెవెన్యూ సిబ్బంది రాజేశ్వర్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులపై వెళ్లిన వారికి సన్మానం



బదిలీలు, పదోన్నతులపై వెళ్లిన వారిని సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి సాధారణ బదిలీల్లో పదోన్నతులపై వెళ్లిన వైద్యుల, కార్యాలయ ఉద్యోగుల నర్సింగ్ ఆఫీసర్లకు ఘనంగా సన్మాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్, వైద్య కళాశాల నాగ మోహన్, టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ప్రతిమ రాజ్, టిఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ మాట్లాడుతూ.. ఈ ఆసుపత్రి నుండి బదిలీపై, పదోన్నతులపై వెళ్లిన ఉద్యోగుల సేవలు మరువలేనివని, వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని అన్నారు. పదోన్నతి పొందిన వారికి అభినందనలు తెలుపుతూ, జీజీహెచ్‌కు బదిలీపై వచ్చిన వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీజీహెచ్ నుండి బదిలీపై పదోన్నతిపై వెళ్లిన వైద్యులు, కార్యాలయ సిబ్బంది, నర్సింగ్ ఆఫీసర్లను డాక్టర్ ప్రతిమరాజ్, ఆసుపత్రి సిబ్బంది శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. బదిలీపై, పదోన్నతిపై వెళ్లిన ఉద్యోగులు మాట్లాడుతూ.. ఈ ఆసుపత్రితో ఉన్న అనుబంధం మరువలేనిదని, ఇక్కడ విధి నిర్వహణలో ఎన్నో అనుభవాలు నేర్చుకున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలి

- రాష్ట్ర ఖనిజ సంపద చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పద్మశాలీలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఖనిజ సంపద చైర్మన్ ఈరవత్రి అనిల్ ను మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మండల పద్మశాలి నాయకులు ఉన్నారు.

పిఓడబ్ల్యూ ఏడవ మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మాక్లూర్

ప్రగతిశీల మహిళ సంఘం పిఓడబ్ల్యూ జిల్లా ఏడవ మహాసభ ను జయప్రదం చేయాలని నిజామాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రాధ తెలిపారు. బుదవారం మండలంలోని బొర్గం (కే) గ్రామంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 10న జరిగే ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ జిల్లా ఏడవ మహాసభలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమాజంలో సగభాగం ఉన్న స్త్రీలకు కేంద్ర ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్ కల్పించకపోవడం బాధాకరమని, స్త్రీల హక్కులు పోరాటాల ద్వారానే సాధించుకుంటామని ఆమె అన్నారు. ఈ మహాసభలో గత మహాసభల నుండి నేటి వరకు జరిగిన ఉద్యమాన్ని సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకొని జిల్లాలో మహిళా పోరాటాలకు, ప్రజా సమస్యలపై పోరాటానికి కర్తవ్యాలను రూపొందించు కుంటామన్నారు. కావున జిల్లా వ్యాప్తంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

వన మహోత్సవంలో బాధ్యతలు పంచుకోవాలి



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

అడవుల విస్తీర్ణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతలను పంచుకొని మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ చెట్లుగా పెంచాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చీన్నపూర్, మామిడిపల్లి గ్రామ శివారులో గల అర్బన్ పార్క్ ఏరియాలో అటవీ శాఖ అధికారులతో, బిజెపి నాయకులతో కలిసి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మొక్కలు నాటి నీళ్ల పోశారు. ప్రతి ఒక్కరూ ఈ ఐదు రోజులపాటు స్వచ్ఛ ధనం పచ్చదనంలలో పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటి వాటి పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, బిజెపి మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, జిల్లా బిజెపి ప్రతినిధి సంతోష్, బిజెపి నాయకులు వినోద్, ఆర్మూర్ అటవీశాఖ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ రేంజ్ అధికారులు అశోక్, సుధాకర్, శ్రీదేవి, ఎఫ్ఎస్ఓ గణేష్, ఎఫ్‌బిఓలు పాల్గొన్నారు.

సరైన ధ్రువపత్రాలు లేని
వాహనాలను కొన్నా, అమ్మినా నేరం

నవతెలంగాణ-బిచ్కుంద

దొంగతనం చేసిన వాహనాలను సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను కొన్నా, అమ్మినా నేరమని శిక్షార్హులవుతారని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలం కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో మెకానిక్ షాప్‌ల యజమానులు మెకానిక్‌లతో సమావేశం నిర్వహించారు. ఇటీవల మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనం జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని కొందరు వాటిని స్క్రాప్ చేసి విడి బాగాలు అమ్మడం నేరమవుతుందన్నారు. సమావేశంలో మండల కేంద్రంలోని మెకానిక్‌లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం ఆగస్టు 08, 2024 www.navatelangana.com

లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ ఆర్‌రవీందర్ సూచన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యుత్ సంస్థ అత్యంత విలువలు ఆచరిస్తున్నదని, విద్యుత్ వినియోగదారులకు సురక్షితమైన, విశ్వసనీయమైన, నిరంతరాయమైన, నాణ్యమైన విద్యుత్తును సరసమైన ధరతో అందిస్తున్నదని అవినీతి రహితవ్యవస్థ ఏర్పాటుకు నిబద్ధతతో ముందుకు పోతున్నట్టు సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఆర్ రవీందర్ తెలిపారు. విద్యుత్‌కు సంబంధించిన ఎవరైనా అధికారులు, సిబ్బంది లంచం అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బుధవారం వాల్‌స్టిక్కర్స్, ఫోంబోర్డులను సర్కిల్ పరిధిలోని ఆఫీస్‌లలో ఏర్పాటు చేశారు. తమ ఫిర్యాదులను ఫోం బోర్డు, స్టికర్లపై ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి లేదా టోల్ ఫ్రీ నెం.1064 నంబరుకు లేదా మొబైల్ నం.9281033233 కు ఫోన్ చేసి తెలపాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే స్వచ్ఛదనం, పచ్చదనం సాధ్యం
- అధికారుల సూచన

నవతెలంగాణ-బాన్సువాడ (నసూరుల్లాబాద్)

గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాన్సువాడ ఆర్డీఓ రమేష్ రాథోడ్ తెలిపారు. బుధవారం బాన్సువాడ మండలంలోని దేశాయిపేట గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛందనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని గ్రామంలోని వివిధ వార్డుల్లో తిరుగుతూ గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మురికి కాలువలను శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బాన్సువాడ ఆర్డీఓ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం పచ్చదనంను ప్రజలు విజయ వంతం చేయాలని ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగ్య స్వాములు కావాలన్నారు. పల్లెలు స్వచ్ఛంగా, పచ్చదనంగా ఉంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలా న్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయ వంతం చేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



బాన్సువాడలోని దేశాయిపేట్‌లో పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో.. ఎల్లారెడ్డి మండలంలో ఆర్డీవో మన్నే ప్రభాకర్ పరిశీలన


నిజాంసాగర్ : మల్లూర్‌లో మొరంతో రోడ్డు చదును


నాగిరెడ్డిపేట్‌లోని బెజ్జం చెరువుతండాలో..

లింగంపేట్ : లింగంపేట్ మండల కేంద్రంలో బుధవారం స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మురికి కాలువల్లో చేతను తొలగించడం జరిగిందని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తెలిపారు. మురికి కాల్వలో చెత్త చెదారం త పాటు మురికి కాలువల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం జరిగింద న్నారు. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు దోమల నివారణకు మందులను పిచికారి చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా బ్లీచింగ్ పౌడర్ వేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు పారిసిద్దండ పాటించాలని ఆయన సూచిం చారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

బిచ్కుంద : బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పారిశుధ్య సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించి పాఠశాల ఆవరణలో నీరు నిలవకుండా ట్రాక్టర్ల ద్వారా చదును చేయించారు. పోలీస్ స్టేషన్ వెళ్లే దారిలో రోడ్డు కు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు గడ్డిని చెత్తాచెదారాన్ని తొలగించారు. గ్రామ ప్రత్యేక అధికారి తహసిల్దార్ సురేష్ పరిశీలించారు. దశలవారీగా గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ కు తహసిల్దార్ సూచించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నిజాంసాగర్ : మండలంలోని అన్ని గ్రామాలలో స్వచ్ఛాదనం-పచ్చదనం కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పరిశుభ్రత పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. మండలంలోని మల్లూర్ గ్రామంలో మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండకుంట రోడ్డుపై మొరం పోసి బాగు చేయిం చారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ.. ఈనెల 9 వరకు రోజువారి కార్యాచరణ ప్రకారం కార్యక్రమాల్ని విజయవంతంగా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మౌలానా, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ఆవరణలో మండల ప్రత్యేక మండల అధికారులు కలిసి మొక్కలు నాటి, నీటుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతిమొక్కలను కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీకాంతరెడ్డి, ఎమ్మార్వో దశరథ్, పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు కమల, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్రెడ్డి, సొసైటీ డైరెక్టర్ నాగిరెడ్డి, ఉపాధ్యాయులు గ్రామపంచా యతీ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను బుధవారం నాడు ఎల్లారెడ్డి ప్రత్యేక అధికారి ఆర్డీవో మన్నె ప్రభాకర్ భిక్కనూర్, లక్ష్మాపూర్ గ్రామాలలో తనిఖీ చేశారు. ఉదయం భిక్కనూరు గ్రామంలో మురికి కాల్వల శు భ్రత,నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చడం వలన గ్రామంలో దోమలు ప్రబలకుండా ఉంటాయని తెలిపారు. భిక్కనూరు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పాఠశాల ఆవరణను పరిశు భ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం సందర్శించి పారిశుద్ధ్య పనులు పరిశీలించి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాష్, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఆయా గ్రామాల ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం పట్ల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని నసురుల్లాబాద్ మండల ప్రత్యేక అధికారి దయానంద్ ఆదేశించారు. సంగెం గ్రామంలో కార్యక్రమాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణతో పాటు ప్రధాన రహదారుల వెంట ఉన్న పిచ్చి పొదలను పంచాయతీ సిబ్బందితో తొలగించి పరిశుభ్రం చేయించారు. గ్రామాల్లో మొక్కను నాటారు.ఆయన వెంట స్థానిక పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, కరోబార్ , ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండలంలోని బెజ్జం చెరువు తండాలో పారిశుధ్య పనులను మండల స్పెషల్ ఆఫీసర్ వీరస్వామి బుధవారం పరిశీలించారు. గ్రామంలో దోమలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం నిర్వహించా లని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అనిత ఉన్నారు.

రోడ్డు అధ్వానం

- కోట్లు ఉన్నా.. మార్కెట్ రోడ్డుకు మోక్షం ఉండదా?


బురదమయంగా మారిన రోడ్డులో దిగబడ్డ ట్రాక్టర్ టైర్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రతి సంవత్సరం కోట్లల్లో ఆదాయం వస్తున్నా పత్తి మార్కెట్ రోడ్డుకు మోక్షం మాత్రం కలగడంలేదు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పెద్దషక్కర్‌గా రోడ్డు జాతీయ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మించవలసి ఉంది. ఆదాయం వచ్చే రోడ్డుకు అభివృద్ధి నోచుకోకపోవడం అత్యధికంగా వ్యాపారాలు కొనసాగే ఈ రహదారి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. లోడ్‌తో వచ్చే వాహనాలు బురదమయంగా మారిన రోడ్డుతో దిగబడుతున్నాయి. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ అధికారులు ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని వ్యాపారస్తులు, వాహనదారులు, గ్రామస్తులు, కోరుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

నవతెలంగాణ-లింగంపేట్

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం అని డీఎల్‌పీఓ సురేందర్ అన్నారు. బుధవారం లింగంపేట్ మండలంలోని మంభోజిపేట్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణీలకు బాలింతలకు తల్లిపాల గురించి వారికి వివరించారు. తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాలు శారీరకంగా ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం స్వచ్ఛదనం పచ్చదనంల కార్యక్రమంలో భాగంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాళ్లను వేశారు వనమోత్సవాలు భాగంగా మొక్కలు నాటారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మోహన్ రెడ్డి కార్యదర్శి పవన్ ఐ కెపి సి సి రాజేశ్వర్ క్షేత్ర సహాయకులు సాయ గౌడ్ ఏఎన్ఎం జ్యోత్స కారబర్ జీవన్రావు ఆశా వర్కర్లు గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మండల స్పెషల్ అధికారి కిషన్ ఆకస్మికంగా తనిఖీ బుధవారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూప్రకారం తప్పకుండా విద్యార్థులకు అందించాలన్నారు. పౌష్టికాహార పదార్థాలు, వంటకాలను రుచికరంగా వండాలని సూచించారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పిల్లలతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ఆవరణ, భోజనం బాగుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో దశరథ్, ఎంపీఓ లక్ష్మీకాంత్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్, గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సునీత, జిల్లా పరిషత్ ఉన్నత ప్రధానోపాధ్యాయురాలు కమల, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-కామారెడ్డి

బీజేపీ కామారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కాటిపల్లి భాస్కర్ రెడ్డి జిల్లా కమిటీని నియమించారు. కిసాన్ మోర్చా కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్గా వల్ల కొండ రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బాయికాడ ఆనందరావు, బాణాల మైపాల్ రెడ్డి, మేడిపల్లి నరసింహులు, కార్యదర్శులుగా దేవి రెడ్డి గంగారెడ్డి, మోహన్, సహాయ కార్యదర్శిగా జలంధర్ రెడ్డి, అన్నారం వెంకటరెడ్డి, దుర్గారాం, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, కోశాధికారిగా సుధాకర్ రెడ్డి, ఫోక్ పర్సన్ గా లింగారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా వీరేశం, బలవంత రెడ్డి, జోగు శివరాజు, సాయి, మల్లయ్య, గోపి, సాయి రెడ్డి, పోల్కం గోపాల్, లక్ష్మారెడ్డి, పొన్నాల మధుసూదన్, నరసింహారెడ్డి, మొగిలి రాజు, ఐ టి సెల్ కన్వీనర్ గా స్వామీ లను ప్రకటించారు. నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందనీ ఆయన పేర్కొన్నారు.

నల్ల బ్యాడ్జిలతో న్యాయవాదుల నిరసన


కోర్టు ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-కామారెడ్డి

జనగామలో న్యాయవాద దంపతులపె జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం కామారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు విధులకు హాజరయ్యారు. జిల్లా కోర్టు ప్రాంగణం ముందు ధర్నా చేసి జనగామ పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించరు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో న్యాయవాదులపై దాడి చేయడం పోలీసులకు పరిపాటి అయిందని ఇట్టి విషయమై సదరు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అలాగే న్యాయవాదుల రక్షణ కొరకు వెంటనే న్యాయవాదులు రక్షణ చట్టం అమలు చేయవలసిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జగన్నాథం, శంకర్ రెడ్డి, అన్వర్ షరీఫ్, సిద్ధి రాములు, శ్యామ్ గోపాల్, బిక్షపతి, అమృత రావు, అతిమాముల శ్రీధర్, గోవర్ధన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నారెడ్డిమోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌ను జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధికెక్కిన మండలంలోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని దర్శించుకోవాలని ఆయనను కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోసానిపేట మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు గంగ్ర నర్సింలు, కాంగ్రెస్ నాయకుడు పోతుల చిన్న భాస్కర్ రెడ్డి ఉన్నారు.

రోగికి చికిత్స అందించిన ఆలన బృందం


చికిత్సకోసం తరలిస్తున్న సిబ్బంది

నవతెలంగాణ-రామారెడ్డి

మండలం లోని మద్దికుంట గ్రామానికి చెందిన బొమ్మిడి రాములు అనారోగ్యంతో బాధపడు తుండటంతో బుధవారం ఆలన సెంటర్‌కు సమాచారం అందించగా, ఆలన బృందం రోగి ఇంటి వద్ద ప్రథమ చికిత్స నిర్వహించింది. మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి లోని ఆలన సెంటర్ కు తరలించారు. కార్యక్రమంలో వైద్యులు పటేల్ గణేశం, కే రాజేష్, సుప్రియ, ఆశాలు తోట యశోద, కవిత తదితరులు ఉన్నారు.

బస్సు సమయపాలనలో మార్పు

ఉదయం 9 నుంచి 10:30 మధ్యలో బస్సులు

నవతెలంగాణ-మద్నూర్

ప్రయాణికులు ఎక్కువ బస్సు సర్వీసులు తక్కువ సమయపాలన లేని బస్సు సర్వీసులు అనే శీర్షికతో నవతెలంగాణ గత నాలుగైదు రోజుల క్రితం ప్రచురించిన శీర్షికకు బాన్సువాడ డిపో ఆర్టీసీ శాఖ అధికారులు బస్సు సర్వీసుల సమయపాలనలో మార్పులు చేర్పులు చేసినట్టు కనిపిస్తుంది. మండల కేంద్రం నుంచి ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల మధ్య బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. తెల్లవారు జామున 5 గంటల నుంచి ఉదయం 8 గంటల మధ్య బస్సు సర్వీసులు లేకపోవడంతో, ఉదయం 6, 7గంటలకు ఎక్కడికైనా వెళ్లాలంటే ఉదయం ఎనిమిది గంటల తర్వాతనే బస్సు సర్వీసులు ఉన్నట్లు ఆ మధ్యలో మూడు గంటలు బస్సు సర్వీసులు లేక ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ సమయంలో కూడా బస్ సర్వీసులు నడిపితే ఇటు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి అటు కామారెడ్డి జిల్లా కేంద్రానికి సౌకర్యంగా ఉంటుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న మల్లికార్జున్

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలం లోని సుల్తాన్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు షాదుల్ కుమారుడికి ఇటీవల రోడ్డు ప్రమాదం జరగడంతో విషయం తెలుసుకున్న నిజాంసాగర్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ బుధవారం పరామర్శించారు. అనంతరం గ్రామంలోని స్వచ్ఛదనం-పచ్చదనం భాగంగా గ్రామంలోని వివిధ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీవీబీ హాస్టల్‌లో మరుగుదోడ్ల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ధరించాలి

- ఘనంగా జాతీయ చేనేత సహకార దినోత్సవ వేడుకలు


పిట్లంలో..

నవతెలంగాణ-కామారెడ్డి/పిట్లం : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ పాల్గొని జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చేనేత వస్త్రం యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏడి సంతోష్, డిపిఎం రమేష్‌బాబు, డిఆర్డిఏ జిల్లా అధ్యక్షులు సిరిగాదా లక్ష్మీనరసింహ, ప్రధాన కార్యదర్శి బొమ్మరి రాజయ్య, కోశాధికారి సభ్యుని ధర్మపురి, ఉపాధ్యక్షులు కృష్ణ హరి, చేనేత అధ్యక్షులు కార్యదర్శులు, అర్బన్ నుండి కమ్యూనిటీ ఆర్గనైజర్ అనసూయ, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా కార్యదర్శి నీల కంటి సంతోష్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత రెండో పెద్ద పరిశ్రమ చేనేత పరిశ్రమనేనని కొని యాడారు. ప్రస్తుత తరుణంలో చేనేత పరిశ్రమ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమను అభివృద్ధి చేసి కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గుర్రపు బాలరాజ్ , సభ్యులు లోక మనోహర్ రామ్ , గూడ నర్సింలు , చుక్కల తీర్థం శంకర్ , గణేష్ , రాజన్న తదితరులు తదితరు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్‌నేరాల కట్టడి


ఎల్లారెడ్డిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-కామారెడ్డి/ఎల్లారెడ్డి/నాగిరెడ్డిపేట్/నసురుల్లాబాద్

జిల్లా కేంద్రంలోని పిజెఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ షీ టీం, ఆంటీ హ్యూమెన్ ట్రాఫిక్ యూనిట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఐ రాజేశ్వరావులు మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వాటి భారికి గురికాకుండా ఉండొచ్చని విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల చైర్మన్ కే.గురువేందర్‌రెడ్డి విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎటువంటి పరిస్థితులైన తమ ధైర్యంతో ఎదురుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్‌గౌడ్, డైరెక్టర్ గోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ ప్రసాద్, అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ప్రతి నెల మొదటి బుధవారం రోజు నిర్వహించే సైబర్ నేరాల అవగాహన కార్యక్రమం లో భాగంగా బుధవారం నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ నకిలీ ఫోన్ కాల్స్,ఎస్ఎంఎస్ లు,ఈ సిమ్ కార్డ్, మోసాలు మోసపూరిత లింకులు, ఓటీపీలు తదితరాల ద్వారా జరిగే సైబర్ నేరాలను గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. సైబర్ నేరాలకు గురైన ప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1930 ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాన్సువాడ (నసురుల్లాబాద్) : సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే, డయల్-100పై అవగాహన కలిగి ఉండాలని బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ విద్యార్థులకు, బుధవారం బాన్సువాడ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, డయల్ 100పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో పోలీస్ సిబ్బంది డయల్ 100 పై అవగాహన కల్పించారు.

నాగిరెడ్డిపేట్ : మండలంలోని గోపాల్‌పేటలో గల యూనియన్ బ్యాంక్ ఆవరణలో ఏఎస్ఐ లచ్చిరాం సిబ్బందితో కలిసి బ్యాంక్ ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన బుధవారం కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన పలు జాగ్రత్తలు వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపినటువంటి లింకులను ఓపెన్ చేయకూడదని వారు సూచించారు. సెల్ఫోన్ వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి పెంటయ్య మహేష్ శివ, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

మహిళపై దాడిచేసిన
ఫారెస్ట్ అధికారులపై కేసులు నమోదు చేయాలి

- సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

నవతెలంగాణ-కామారెడ్డి

ఒక మహిళ అని చూడకుండా భౌతిక దాడి చేయడం బోరు, పైపులు ధ్వంసం చేసి హేయమైన చర్యకు పాల్పడిన ఫారెస్ట్ అధికారులపై కేసులు పెట్టి శిక్షించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మర్రి మండలం ఇసాయిపేట గ్రామ శివారులో గల వడ్డెర కాలనీలో కొన్ని కుటుంబాలు గత 50 నుంచి 60 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నాయనీ, అదే ప్రాంతంలో పోడు భూమిని సాగు చేస్తున్నారన్నారు. మొన్న వర్షాకాలం సమీపించడంతో మక్కా విత్తనాలు వేసినట్టు తెలిపారు. అటు వచ్చిన ఫారెస్ట్ అధికారులు వరువేసిన మొక్కలను ధ్వంసం చేస్తున్నప్పుడు అక్కడే ఉన్న మహిళ అడ్డుకోవడానికి వెళితే మహిళా అని చూడకుండా విచక్షణ రహితంగా ఆమెను కొట్టినట్టు ఆరోపించారు. ఏదైనా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి కానీ, భౌతిక దాడి చేయడం సరికాదన్నారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారమే అక్కడ జీవిస్తున్న రైతులు ఆ యొక్క భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. ఇది అధికారులు గమనించాలని ఆయన పేర్కొన్నారు. మహిళపై దాడి చేసినటువంటి అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని వారిపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏ.ప్రకాష్, జి.సురేష్, కిషోర్, రైతులు రాములు, కుమార్, శ్రీకాంత్, లక్ష్మి, సరిత, సాయవ్వ, వెంకట్, శ్రీను, మల్లవ్వ పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలి

మండల పశువైద్యాధికారి శిరీష

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

వీధి కుక్కల పట్ల ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని మండల పశు వైద్యాధికారి శిరీష అన్నారు. బుధవారం మండలంలోని కలిగోట్, చింతలూరు, కొలిప్యాక్, తొర్లికొండ, మనోహరాబాద్ తదితర గ్రామాలలో గ్రామస్థాయి అధికారులతో వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈనెల 8న ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది వీధి కుక్కల సర్వే నిర్వహించాలని సూచించారు. కుక్క కరిచిన వెంటనే 24 గంటల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి టీకాలు తీసుకోవాలని తెలియజేశారు. పశువులకు కూడా కుక్కలు కరిస్తే వెంటనే 24 గంటల్లో పశు వైద్య శాలలో టీకాఇప్పించాలని తెలియజేశారు. కుక్కల పట్ల నిర్లక్ష్యం వహించకుండా కుక్కల జోలికి వెళ్లకూడదని తెలియజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ ప్రత్యేక అధికారులు పంచాయతీ సెక్రెటరీలు గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

పిఆర్ డిఈఈగా అహ్మద్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ధర్పల్లి



బాధ్యతలు స్వీకరిస్తున్న పీఆర్ డీఈఈ

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా బుధవారం అహ్మద్ హుస్సేన్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు సిరికొండ మండల పీఆర్ ఏఈగా విధులు నిర్వహిస్తూ ధర్పల్లి మండల ఇంచార్జి ఏఈ విధులు నిర్వహించారు. డిఈఈగా పదోన్నతిపై ధర్పల్లి కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఈసందర్భంగా పలువురు ఆయనకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్ల హన్మంత్ రెడ్డి, అబ్దుల్ మజీద్, లొక్కిడి రాములు, అబ్దుల్ నజీర్, నూకల నర్సయ్య, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ వార్తకు స్పందన

ప్రమాదకర గుంత పూడ్చివేత

నవతెలంగాణ-రెంజల్



గుంతను పూడ్చివేయిస్తున్న కార్యదర్శి

ఈ నెల 4 న నవతెలంగాణ దినపత్రికలో "ప్రమాదకర గుంత "అనే శీర్షికన వార్త రావడంతో రెంజల్ గ్రామ కార్యదర్శి రాజేందర్ రావు స్పందించారు. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంతను బుధవారం డస్ట్, కంకరతో పూడ్చి వేయించారు. ఎదుర్కొన్నారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ భాస్కర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ శాస్త్రవిభాగంలో ఉమారాణికి పిహెచ్‌డి పట్టా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలకు చెందిన పరిశోధక విద్యార్థిని ఆర్. ఉమారాణి, డాక్టర్ రావులపాటి మాధవి పర్యవేక్షణలో 'ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ అగెనెస్ట్ సెక్సువల్ హరాచ్‌మెంట్ విత్ స్పెషల్ రిఫరెన్స్ యునైటెడ్ హైదరాబాద్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథం సమర్పించారు.ఈ వైవాకు ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీతా కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థిని ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో ఆర్ ఉమారాణి కి డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ ఓపెన్ వైవా కు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా ఆ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, విభాగపతి డాక్టర్ కె ప్రసన్న రాణి, పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్.యం అరుణ, న్యాయ శాస్త్ర సహా ఆచార్యులు డాక్టర్ బి. స్రవంతి, అధ్యాపకురాలు డాక్టర్ ఎం నాగజ్యోతి, అధ్యాపకులు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి చేసిన డిఐని సర్వీసు నుంచి తొలగించాలి

నవతెలంగాణ-భీంగల్

షాద్‌నగర్ దళిత మహిళ సునీతపై దాడి చేసిన డిఐ రామిరెడ్డిని సర్వీస్ నుండి తొలగించాలని ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓ కేసులో మహిళ అని చూడకుండా దాడి చేసిన డిఐ రామిరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి విధుల నుండి పూర్తిగా తొలగించాలని పేర్కొన్నారు. అలాగే బాధిత మహిళకు 25 లక్షల నష్ట పరిహారం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూమన్న ,దాసులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ ఆఫీసులో బుధవారం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం.. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ, మున్సిపల్, విద్య, వైద్య, రవాణా కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, పిఎఫ్ , ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు చేయవద్దని, వారు సూచించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ ఆపి ఉపాధి భద్రత కల్పించాలని వారు మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలమౌలిక సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించాలని వారు సూచించారు. సమావేశంలో నాయకులు సూర్య శివాజీ, జేపీ గంగాధర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రూలలో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని , ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యులు వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్‌లోగల బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే బుధవారం సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే వారికి అందుతున్న వైద్య సేవల గురించి, సమస్యల గురించి స్థానిక కౌన్సిలర్ మీర్ నజీర్ అలీతోపాటు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోధన్ జిల్లా ఆస్పత్రిలో త్వరలోనే గైనకాలజిస్టుల నియామకాలు చేపడతామని తెలిపారు. వైద్య విద్యను అభ్యసించిన సీనియర్ డాక్టర్ల కోసం తాము పరిశీలిస్తున్నామని త్వరలోనే నియామకాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. రోగులు సంయమనం పాటించి వైద్యులకు సహకరించాలని ఆయన కోరారు. వైద్యులతో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, దయచేసి ప్రజలు ఆలోచించి సంయమనం పాటిస్తూ వైద్యుల ద్వారా నాణ్యమైన సేవలను అందుకోవాలని ఆయన సూచించారు. బస్తీ దవాఖానలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున బస్తీ దవాఖానకు పలు మందులను ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్‌హందాన్, డిసిసి డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినుద్దీన్, కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఎడపల్లి

సీపీఎం(ఎంఎల్)ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ ధన్వాల్ సింగ్ కు వినతిపత్రం అందజేశారు. ఆసరా పింఛన్లు, ఇండ్లు స్థల లేని వారందరికీ 5 లక్షలు మంజూర్ చేస్తామని, ఇల్లు లేని వారికి డబల్ బెడ్ రూములు ఇవ్వాలన్నారు. జీవనభృతి చెల్లించాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలన్నారు.కార్యక్రమంలో ఎడపల్లి, నవపేట్ మండలాల కార్యదర్శి గుమ్ముల గంగాధర్, మండల కమిటీ సభ్యులు మల్లేష్, క్యాతం రవి, కొంద్ర లక్ష్మణ్, చింతల పోశెట్టి, రెంజల్ పోశెట్టి, భూమయ్య తదితరులు పాల్గొన్నారు..

పంట ఉత్పత్తులకు

ఎంఎస్‌పీ గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంటులో పెట్టాలి

- **రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్**

నవతెలంగాణ-బోధన్



మాట్లాడుతున్న పల్లపువెంకటేష్

రైతులు పండించే పంట ఉత్పత్తులకు కనీసం మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం బోధన్ పట్టణంలోని పిఆర్‌టీయూ భవన్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి 14 రకాల పంటలకు కేవలం నామినల్‌గా మద్దతు ధర ప్రకటించిందని అన్నారు. నేటి పరిస్థితుల్లో రైతాంగం చాలా నష్టాల్లో అన్నారని అన్నారు. పెరిగిన ధరల వల్ల రైతులంతా నష్టపోయారని, రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని కోరారు. ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాల్లో స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి ఎంఎస్పి మద్దతు గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలో రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతాంగం గతంలో చేసిన పోరాటాల మాదిరిగా మరో పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీ 30శాతం, 40శాతం రైతులకు అందలేదని అన్నారు. ఆధార్ కార్డు పేరుతో న్యూడ్యూస్ పేరుతో కొన్ని రోజులు ఈసీ పేరుతో కొన్ని రోజులు సొసైటీలు బ్యాంకుల చుట్టూ రైతులు తిరుగుతున్నారని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని అన్నారు. ఇప్పటివరకు రుణంమాఫీ అయిన రైతులందరికీ పెట్టుబడికి కొత్తగా బ్యాంకులు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్ అప్పా, ఉపాధ్యక్షులు తోకటి భూమేష్‌శ్వర్, గంగామణి, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, కమిటీ సభ్యులు దేవనూరు రాజన్న, మెగావత్ రాంసింగ్, నాగలక్ష్మి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని పడగల్ వడ్డెర కాలనీ ఉచ్ఛతర ప్రాథమిక పాఠశాల లో పనిచేసి బదిలీపై పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. జిల్లా పరిషత్ చేపూర్ పాఠశాలకు వెళ్లిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు వినోద్ కుమార్, మోతే జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లిన పిఆర్టియు ప్రధాన కార్యదర్శి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సి.వీ నరసింహారావు, జిల్లా పరిషత్ సావెల్ పాఠశాలకు వెళ్లిన హిందీ ఉపాధ్యాయురాలు వీణ, జిల్లా పరిషత్ శెట్టిపల్లి పాఠశాలకు వెళ్లిన గోదావరి, అంగన్వాడీ ఉటీచర్ రాజుబాయి ఉద్యోగ విరమణగా సన్మానించినారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అంబుజారాణి, పిఆర్‌టియు మహిళా కార్యదర్శి అంజలి, నర్సయ్య, గీతా, పంచాయతీ కార్యదర్శి భరత్ లు ఘనంగా సన్మానించారు.

ఆలూరు ఉన్నత పాఠశాలలో..

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలూరులో బదిలీ, పదోన్నతులపై వచ్చిన ఉపాధ్యాయులకు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, మిర్దాపల్లి, దేగాం, మచ్చర్ల ప్రధాన ఉపాధ్యాయులు కుంట శ్రీనివాస్ రెడ్డి, మోహన్, పండరి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం ముడవ రోజు మండలం లోని దర్మారం బీ గ్రామంలోని మురుగు కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాల్లో కార్యక్రమం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా పరిషత్, ముఖ్య కార్య నిర్వహణ అధికారి బి.ఉష పాల్గొన్నారు. ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో సిహెచ్‌సిసబ్ సెంటర్ కేంద్రాలు, పశు వైద్య కేంద్రాలు, పరిసరాలను పరిశుభ్రం చేశారు. మురుగు కాలువలో పూడికలు తీయించాలని, ఓహెచ్‌ఎస్ఆర్ నీటి ట్యాంకుల దగ్గర నీరు నిల్వకుండా నీరు ప్రవహించే విధంగా కాలువలు తీయాలని అన్నారు. నీరు నిలిచే లోతట్టు ప్రాంతాల్లో మొరం పోయించాలని, ప్రతి ఇంటింటికి 6 మొక్కలు ఇచ్చి ఖచ్చితంగా నాటే విధంగా చూడాలని ఆమె ఆదేశించారు. గ్రామంలోని పల్లె దవాఖాన తనిఖీ చేసి అక్కడ మొక్కను నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.యోహాన్ (డిస్టిక్ డిప్యూటీ కమిషనర్ లేబర్ డిపార్ట్మెంట్ నిజామాబాద్), యంపిడిఓ రవీందర్, యంపిఓ శ్రీనివాస్ గౌడ్, పంచాయతి కార్యదర్శి సురేంద్ర మొగుల్లురు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్కాల్:మండల కేంద్రంలో బుధవారం డ్రైనేజీ-గుంతలు పూడ్చడం వంటి పలు కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని కొత్తపల్లి, వేంపల్లి, నాగంపేట్, నల్లూర్, వెంచిర్యాల, రెంజర్ల గ్రామాల్లో మొక్కలు నాటారు. ప్రతి ఇంటా నీటిని వృథా చేయకుండా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్రవంతి, ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్, ఎంపీవో యం.డి.గౌస్ మోహిమోద్దీన్, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బోధన్:స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహణ తీరును బుధవారం డీఆర్డీఓ పీడీ సాయగౌడ్ బోధన్ మండలంలో ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా బెల్లాల్, అమ్దాపూర్ గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామస్తులను భాగస్వామ్యం చేసుకొని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కాలనీలలో పిచ్చి మొక్కలు తొలగించి మురుగు తొలగించి పరిశుభ్రంగా మార్చాలన్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి గ్రామస్తులకు శుభ్రమైన తాగునీటిని అందించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో బాలగంగాధర్, టీఏ అల్తాఫ్, ఏపీఓ హేమలత, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పోతంగల్ :మండలంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎంపీవో అధికారులతో కలిసి దోమలేడిగి గ్రామాన్ని బుధవారం సందర్శించారు. నీటి ట్యాంకు వద్ద నిలిచిపోయిన నీటిని కాలువ ద్వారా బయటకు పంపించారు. శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు, పల్లె దవఖాన వద్ద మొక్కలు నాటించారు. టాక్లి గ్రామంలో మురికి కాలువల పూడికలు తీయించి, ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. సోంపూర్ గ్రామంలో జిఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ వద్ద శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురికి కాలువల పూడికలు తీయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్ :మండలంలోని వీరన్న గుట్ట ప్రధాన రోడ్డు కింద ఉన్న నీటి గుంటల్లో ఎంపీఓ రఫీ హైమద్, గ్రామ కార్యదర్శి రాజు బుధవారం ఆయిల్ బాల్స్‌ను వేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా నిల్వనీటిలో దోమలు చనిపోవడానికి ఈ ఆయిల్ బాల్స్ వేసినట్లు వారి పేర్కొన్నారు. వారి వెంట బాబా, అంగన్వాడి కార్యకర్త బి .శాంత, తదితరులు ఉన్నారు.

మండలంలోని వీరన్న గుట్ట గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, మురికి కాలువలను ఎంపీఓ రఫీ హైమద్, గ్రామ కార్యదర్శి రాజు కూలీలతో శుభ్రం చేయించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారంతోపాటు ముళ్ళకంపలను తొలగించారు. కార్యక్రమంలో కారోబార్ బాబా, అంగన్వాడీ కార్యకర్త శాంత, గ్రామ సంఘం అధ్యక్షురాలు, పారిశుధ్య కార్మికులు, కూలీలు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం పచ్చదనంలో గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరంగా కృషి చేయాలని డిఎల్‌పీవో మధుకర్ అన్నారు. మండలంలోని తాడ్ బిలోలి గ్రామంలో పంచాయతీ రికార్డులను డిఎల్‌పీవో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు నీరు నిలువ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్‌ను వేయించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. సబ్ సెంటర్ ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెంట్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి రాఘవేందర్ గౌడ్, వైద్య సిబ్బంది లక్ష్మీనారాయణ, క్షేత్ర సహాయకుడు మధు, ఆరోగ్య కార్యకర్త మంజుల, ఆశలు పాల్గొన్నారు.

మండలంలోని కల్యాపూర్ గ్రామంలో మురుగు కాలువలు పేరుకుపోయి రోడ్డుపైకి నీరు వస్తుండడంతో గ్రామ కార్యదర్శి నవీన్ మట్టిని తొలగిస్తూ శుభ్రం చేయించారు. ఆయిల్ బాల్స్‌ను వేయించినట్లు ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

- బాలికకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు
- 20వేలు ఆర్థిక సహాయం చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ శరత్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్

సోమవారం రాత్రి బోధన్ మున్సిపల్ కౌన్సిలర్ రాధాకృష్ణ చేతిలో అత్యాచారానికి గుర్కైన బాధిత బాలిక కుటుంబాన్ని బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. అధికారులతో కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన సంఘటన గురించి ఏసీపి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధిత బాలిక కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ తూము పద్మశరత్ రెడ్డి 20వేలు తక్షణ ఆర్థిక సహాయంగా అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందించారు. మైనర్ బాలికపై కామాంధుడు రాధాకృష్ణ చేసిన ఘాతుకం చాలా బాధాకరమని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మేడిపల్లి మండలంలో బాలికను ఇంటి వద్ద దించేస్తానని చెప్పి ఇంతటి అఘాయిత్యానికి పాల్పడడం శోచనీయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. ఇలాంటి ఘటనకు పాల్పడిన రాధాకృష్ణను 24 గంటల్లోపే అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారని, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. బాధిత బాలికకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఆమె పేరిటనే ఒక ఇంటిని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. నిరుపేద కుటుంబంలో ఉన్నందున ఆమెకు ఉద్యోగ అవకాశాల కోసం పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పిల్లలకు తల్లిపాలు శ్రేష్టమైనవి

నవతెలంగాణ-బోధన్



పుట్టిన చిన్నారులకు తక్షణమే ముర్రుపాలు పట్టించిన, 6 నెలల వరకు తల్లిపాలు అందించడం ఎంతో శ్రేష్టమైన జిల్లా మహిళ సంక్షేమానికి రసూల్ బీ అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగ బుధవారం బోధన్ పట్టణంలోని రాయన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా చిన్నారులకు తల్లిపాలు అందించడంలో మెరుగైన ఫలితాలు పొందిందని అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఐసీడీఎస్ సిబ్బంది బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారని అన్నారు. అనంతరం

ఆర్కే లక్ష్మి చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ దీపక్ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన గంట లోపల ముర్రుపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, తల్లిపాలు అమృతమని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే తేనె కానీ బర్రె పాలు గాని పౌడర్ పాలు గాని ఇవ్వడం వల్ల బిడ్డకు జరిగే అనర్థం గురించి వివరించారు. అనంతరం ఆరోగ్యవంతమైన పోటీలో విజేతలయిన చిన్నారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ప్రాజెక్ట్ సిడిపిఓ జానకమ్మ మెడికల్ ఆఫీసర్ సమతా, హెల్త్ సూపర్వైజర్ నిర్మల, హెల్త్ డి హెచ్ ఈ.ఓ కృష్ణవేణి, ఐకెపి ఎపీఎం వినోద్, మెప్మా శ్రీనివాస్ , పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, నరేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ రాధిక, గోపి లక్ష్మి ఆసియా బేగం, సుమలత, సౌజన్య, గంగ వేణి, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భవతులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

క్రీడలకు సిద్ధం కావాలి

మండల విద్యాధికారి రాజా గంగారాం

నవతెలంగాణ-ఆర్మూర్

పాఠశాలల్లో త్వరలో నిర్వహించే ఆటల పోటీలకు తమయత్తం కావాలని మండల విద్యాధికారి రాజా గంగారాం తెలిపారు. మండల క్రీడల బుధవారం పట్టణంలోని ఎంఆర్సి కార్యాలయంలో సమన్వయ సమావేశం ప్రధన ఉపాధ్యాయులకు పిడి, పిఈటిలకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఈ నెలాఖరులో అర్బన్, రూరల్ క్రీడలు నిర్వహించడం కోసం తేదీలు ఖరారు కాలేదని అన్నారు ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పిడీలను, నూతనంగా మండలం కు వచ్చిన పిఈటీలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కవిత, రవీందర్, హరిత, నారాయణ,చేతన కుమారి, విశ్వనాథ్, జగదీష్, పిడిలు మల్లేష్ గౌడ్, గోపి రెడ్డి గంగాధర్, మధు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండలానికి చెందిన కాంగ్రేస్ నాయకులు బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి,¨న్మానించి పుచ్ఛగుచ్ఛం అందించారు. వీరితోపాటు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, తాహెర్ బిన్ హాందాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సోమదేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రేస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేంఢ్ల రమేష్, మైనార్టీ మండలాధ్యక్షులు మునీరొద్దీన్, రొక్కెడ సంజీవ్, ఎండి అన్వర్, శ్యామ్ సన్, పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఏర్గట్ల



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మాల్యాల భూపతి, లక్ష్మీ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేసిన దంపతులను ఆలయకమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మగ్గిడి వెంకటేష్ గౌడ్,జక్కని మధుసూదన్,రాజు గౌడ్,రాములు గౌడ్, నితిన్ రాజ్, కూశ లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి చిన్నారులకు అక్షరాభ్యాసం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి అంగన్వాడి కేంద్రంలో నూతనంగా వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యా నిర్వహించినట్లు అంగన్వాడీ కార్యకర్త గంగాజమున పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీ బాలింత మహిళలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. గర్భిణులు ఎక్కువగా ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి చిన్నారులు, గర్భిణీ పాలెంత మహిళలు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలన గాలికి వదిలేసిన మున్సిపల్ పాలకవర్గం

సీపీఐ

నవతెలంగాణ- ఆర్మూర్



మాట్లాడుతున్న ఆరేపల్లి సాయిలు

మున్సిపాలిటీ పాలకవర్గం పాలను పూర్తిగా గాలికి వదిలేసిందని భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆరెపల్లి సాయిలు అన్నారు బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో చిన్నపాటి వర్షలు పడుతుంటే రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పాలకవర్గ నాయకులకు, అధికారులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. దోమలు ఎక్కువ కావడం ప్రజలు ఇబ్బంది పడుతున్న మున్సిపాలిటీ. ఆరోగ్య శాఖ వారు నామమాత్రపు సర్వేలతోనే సరిపెడుతున్నారని, ప్రజలు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారో తెలియకుండ పోయిందని అన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ పాలకవర్గం యుద్ధప్రాతిపదికన ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించి ప్రతివార్డులో దోమల మందు పంపింగ్ చేసి బ్లీచింగ్ పౌడర్ వేసి రోడ్లపై మురికి నీరు నిలువకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో బక్కన. నరేష్, లక్ష్మీ నర్సయ్య శ్రీను, మంగ, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి

● సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా)

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గారెంటీలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వాంచారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టు రామడుగు గ్రామంలో 200 మంది పేదలకు 20ఏళ్ల క్రితం 1150 సర్వే నెం.లో పట్టాలు ఇచ్చి, సిఎల్‌డిపి పథకం క్రింద నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశారన్నారు. ఇప్పటికైనా జాయింట్ సర్వే జరిపి పేదలకు కబ్జాలు చూపించాలని అన్నారు. రేషన్ కార్డులు, కొత్త పెన్షన్‌లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలకోసం వెంటనే అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ఆర్ . దామోదర్, మండల నాయకులు కె . ఆశీస్,ఎస్ .రవి, కె శ్రీను, కె శంకర్, టీ అనిల్, పి . శంకర్, ఆశన్న, సాయిలు, రాజన్న, గంగాధర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో డ్రగ్స్‌ను అరికట్టాలి

● విద్యార్థి, యువజన సంఘం నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలను అరికట్టాలని విద్యార్థి యువజన సంఘం నాయకులు జన్నారపు రాజేశ్వర్, వనమాల సత్యంలు అన్నారు. బుధవారం జిల్లా డిసిపి కోటేశ్వరరావుకు విద్యార్థి, యువజన సంఘాల ఆద్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో పక్క రాష్ట్రాల నుంచి డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు సరఫరా అవుతున్నాయని, విద్యార్థులు, యువత డ్రగ్స్‌కి బానిసై వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. రైల్వే స్టేషన్ బస్టాండ్ అడ్డలుగా మార్చుకొని కోట్ల రూపాయలు వ్యాపారం జరుగుతుందన్నారు. హాస్టల్ విద్యార్థులు కూడా వాటికి బానిసైతున్న పరిస్థితి జిల్లాలో ఉందని, రాత్రి వేళల్లో పీకేటింగ్ పెంచాలని, జిల్లా సరిహద్దులలో తనిఖీలు విస్తృతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు బండమీద నర్సయ్య, పిడిఎస్‌యూ జిల్లా నాయకులు నిఖిల్, పివైఎల్ జిల్లా నాయకులు భాస్కర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్
● హాస కొత్తూర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గ్రామాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడ స్థలంలో అధికారులతో కలిసి మొక్కలను నాటి, నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవంలో, స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను కాపాడాలన్నారు. మొక్కలను సంరక్షించేందుకు తగిన



కమ్మర్‌పల్లి: మొక్క నాటిన అదనపు కలెక్టర్ అంకిత్

చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారమన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదాశివ్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్యక్రమాలు..

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని, పరిసరాలను బ్లేడ్ ట్రాక్టర్‌తో శుభ్రం చేయించారు.

మోడల్ పాఠశాలలో శ్రమదానం

ధర్పల్లి : మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం శ్రమాధానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సైఫోద్దీన్, పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర సాహు, ఇతర ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక స్వాధీనం

● నేడు వేలం



నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కొడిచెర్ల గ్రామస్తులు ఇచ్చిన పిర్యాదు మేరకు గ్రామంలో అక్రమంగా నిలువచేసిన నాలుగు ట్రాక్టర్ల ఇసుక డంపు గుర్తించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బుధవారం స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. ఆ ఇసుకను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయబడునని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5000 డిపాజిట్ చేయాలని తహసీల్దార్ తెలిపారు.

మహిళ మిస్సింగ్

నవతెలంగాణ-ధర్పల్లి



అంకం గంగవ్వ

మండలంలోని సీతాయిపేట్ గ్రామానికి చెందిన అంకం గంగవ్వ (46) ఈమె గత నెల 31నుంచి కనిపించడంలేదని భర్త అంకం రాములు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై విక్రమ్ తెలిపారు. బాధితురాలు గత నెల 31న తన భార్య ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయిందని, గతంలో ఇలాగ పలుమార్లు చేసేదని, తర్వాత తనకు తాను వచ్చేదని కానీ ఈసారి ఇంట్లో నుంచి వెళ్లి వారం గడుస్తున్నా ఇంతవరకు తిరిగి రాలేదని, చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో ఎంతగా వెతికిన జాడ తెలువక పోవడంతో ఫిర్యాదు చేస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

విద్యార్థులకు పౌష్టికమైన భోజనాన్ని అందజేయాలి

● అదనపు కలెక్టర్ అంకిత్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-భీంగల్

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న పౌష్టికంగా అందజేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు, నిరువావులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలోని పచ్చదనం-పచ్చదనం అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను, మైనార్టీ పాఠశాలను అడిషనల్ కలెక్టర్ అంకిత్ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలలో అపరిశుభ్రతకు తావివ్వకుండా పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధి జనాన్ని అందజేయాలని అధికారులకు, నిర్వాహకులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మైనార్టీ పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామకష్ణ, ఎంఈఓ స్వామి, మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలతో సురేందర్, వైస్ చైర్మన్ భగత్, కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్ పి లు ఉన్నారు.

ఆశ చూపారు.. మోసం చేశారు

నవతెలంగాణ-బాల్కొండ

ఆన్లైన్ యాప్ ద్వారా ఎక్కువ లాభాలు వస్తా యని ఆశ చూపిన సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపో యిన ఘటన బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. బాల్కొండ ఎస్ఐ మొహమ్మద్ యాసిర్ అరఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దేవపద్మారావు మే నెలలో టెలిగ్రామ్‌యాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు యం రెసిపీస్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపారు. వారి మాయ మాటలు నమ్మి పద్మారావు పలుమార్లు సైబర్ నేరగాళ్ల రూ.67,715 పంపాడు. కానీ ఆయనకు ఎలాంటి లాభా లు రాకపోయేసరికి మోసపోయానని గ్రహించి బుధవా రం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాయమాటలు నమ్మవద్దు : ఎస్ఐ

అత్యాశ చూపి లాభాలు వస్తాయని మెసేజ్లు, ఫోన్ కాల్స్, వెబ్ లింక్ గాని వస్తే ప్రజలు ఎవరు స్పందించవద్దని వారి మాయమాటలు నమ్మవద్దని ఎస్సై తెలిపారు. ఒకవేళ నమ్మి మోసపోయామని గ్రహిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో గానీ 1930 కు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ మొహమ్మద్ యాసీర్ అరఫత్ హెచ్చరించారు.

టై, బెల్ట్, ఐడి కార్డులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ స్థానిక గ్రామ వాస్తవ్యులు ఎస్ఎస్‌సి.1990-91 పూర్వ విద్యార్థి శ్రీ వేముల నాగభూషణం (ఫిజికల్ డైరెక్టర్ కమ్మర్పల్లి) వారి పెద్దబాబు కీర్తి శేషులు వేముల నాగ యోగేంద్ర జ్ఞాపకార్థం బుధవారం సుమారు 200మంది విద్యార్థులకు రూ.20 వేల టై, బెల్ట్, ఐడి కార్డులు అందజేశారు.ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, గంగాధర్, నరసింహ, సునీత, మాలతి, కృష్ణ, గంగా మోహన్, పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ సంతోష్ అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి బుధవారం శాలువాతో సన్మానించారు. కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ గా పనిచేసి బదిలీ పైవెళ్తున్న సంతోష్ ను అర్గుల్ సింగిల్ విండో చైర్మన్, సిబ్బంది సన్మానించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో కార్యదర్శి తిరుపతిరెడ్డి అకౌంటెంట్ సాగర్ , సిబ్బంది పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి.. ప్రజలను రెచ్చగొట్టడం మానుకో

● బడ్జెట్‌పై బీజెపి ఎంపీలు నోరు మూసుకోవడం సిగ్గు చేటు
● బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..
● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణలో ఉన్న ప్రజలను, రైతులను, యువకులను రెచ్చగొట్టే విధంగా రచ్చబండ కార్యక్రమం చేపట్టాలని పిలుపునివ్వడం, కిషన్ రెడ్డి మితిస్థిమితం లేక మాట్లాడటం సిగ్గుచేటని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. బుదవారం ఇందల్ వాయి మండలంలోని మేగ్యానాయక్ తాండ, నల్లవెల్లి, స్టేషన్ తండా, గౌరారం, ఇందల్‌వాయి గ్రామాల్లో మృతి చెందిన పలు కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ పదేళ్లక్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి రీఆర్గనైజేషన్ బిల్లులో పొందుపరిచిన అంశాలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిన రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది బిజెపి ఎంపీలు ఉన్న నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపిన ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఉన్నారని, పైపెచ్చు ప్రజలను రెచ్చగొట్టే విధంగా రచ్చబండ కార్యక్రమం అని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. 8 నెలల క్రితమే రాష్ట్రంలో అధికారంలో కొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకి ఇచ్చిన ప్రతి హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పై అబద్ధాలు వేయడమే బిజెపి , బిఆర్ఎస్ పార్టీలు పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రైతు రుణమాఫీ చేస్తున్నారని, జాబ్ క్యాలెండర్ సైతం విడుదల చేశారని, వచ్చే ఖరీఫ్ నుండి రైతు భీమా వర్తించే విధంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. గత నెలలో హత్యకు గురైన వెంగల్ కూతుర్లకు గురుకులాల్లో చదివించే



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. హత్య చేసిన వారికి ఉపేక్షించొద్దని డిచ్పల్లి సీఐ కి మల్లేష్ ఎస్ఐ మనోజ్ కుమార్ కు ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం పరువురికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫోన్..

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఎక్కువ సంఖ్యలో గల్ఫ్ కు వెళ్ళిన వారు, వివిధ కారణాల చేత మృతి చెందిన వారు ఉన్నారని వారి పేరుపై బ్యాంకుల్లో, సహకార సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు, భార్యలకు ఒక గుంట భూమి లేకున్నా భర్తల పేరుపై రుణాలు పొందారని, ఆ రుణాలు మాఫీ కాలేదని వెంటనే వారందరికీ వర్తించే విధంగా చూడాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి విన్నవించారు. నల్లవెల్లి సహకార సొసైటీ పరిధిలో దాదాపు 100 మంది వరకు రైతులకు రుణమాఫీ కాలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కు ఫోన్ చేసి వివరాలను తెలిపారు. వారందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలని ఎమ్మెల్యే కలెక్టర్ కు కోరారు. మాఫీ కానీ వారి లిస్టును వెంటనే అందజేసే విధంగా చూడాలని సహకార సొసైటీ చైర్మన్లు చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సీఈవో తేజ గౌడ్ లను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి అందరికీ మాఫీ అయ్యే విధంగా చూస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్, డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్, డిసిసి డెలిగేట్లు వెంకట్ రెడ్డి, సుధాకర్, దర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇమ్మడి గోపి, బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షులు ఎల్ ఐ సి గంగాధర్, మాజీ ఎంపిటిసి చింతల కిషన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోర్వెల్ రాజేందర్ రెడ్డి, సుధాకర్ నాయక్,రాజు నాయక్, మాజీ వైస్ ఎంపీపీ పూర్య నాయక్,ముత్యాన్న, జంగిలి లక్ష్మీ, నారాయణ నాయక్, మోతిలాల్, షేక్ సద్దాం, జమీల్ పాషా,మొచ్చె గోపాల్, పెట్రోల్ బంక్ రమేష్ నాయక్, దశర థ్,కాదరి, నవీన్ గౌడ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌కుమార్ సేవలు మరువలేనివి

● మాజీ సర్పంచ్ల ఫోరం మండల కన్వీనర్ సత్యనారాయణ



సంతోష్‌ను సన్మానించిన ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత 14 ఏళ్ల క్రితం గ్రామంలోని ప్రాథమిక ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన సంతోష్‌కుమార్ చేసిన సేవలు మరువలేనివని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు లోలం సత్యనారాయణ అన్నారు. బుధవారం ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మాజీ సర్పంచ్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మాజీ చైర్మన్ల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్ల క్రితం పాఠశాలకు వచ్చినప్పుడు 12 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతిరోజు ప్రతిఇంటికి సంతోష్‌కుమార్ వెళ్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ 100పై చిలుకు పిల్లలకు విద్య బోధన చేయించారన్నారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ జల్లెల శ్రీనివాస్, పంపడి రాజమోహన్, ఎస్.సుదర్శన్, పి.శ్రీకాంత్, కవిత, మౌనిక, శారద, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ప్రభుత్వ పాఠశాలలో చోరి జరిగిన ఘటన నిజామాబాద్ రెండవ టౌన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో చోరీ జరిగినట్టు బుధవారం ఉపాధ్యాయులు గమనించారు. రెండు ట్యాబ్ అపహరించినట్లు పోలీసులకు తెలియజేశారని ఎస్సై తెలిపారు. పోలీసులకు పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

అమృత్‌సర్‌లో జాతీయ ఓబీసీ మహాసభ

నవతెలంగాణ-కంఠేశ్వర్

మండల్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 7న నిర్వహించే జాతీయ మహాసభలను ఈ ఏడాది పంజాబ్ రాష్ట్రంలోని అమృత్సర్‌లో నిర్వహించినట్టు నాయకులు తెలిపారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై గళం విప్పాల్సిన సరైన సమయం అన్నారు. ఇప్పుడు మన హక్కుల కొరకు పోరాడక పోతే రాబోవు తరాలకు మనం అన్యాయం చేసిన వారిమవుతామన్నారు. కులగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్, కరిపె రవిందర్, మాడవేడి వినోద్, కొయ్యాడ శంకర్, శ్రీలత, రవి, బసవరాజు, విజయ్, పవార్, మహేష్, దామోదర్, సతీష్, నిరంజన్, విశాల్, తదితరులు పాల్గొన్నారు


గ్రామపంచాయతీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గ్రామపంచాయతీకి నూతనంగా వచ్చిన సెక్రటరీ గంగాధర్‌ను మండల మాజీ కోఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్‌ఖాన్ మర్యాదపూర్వంగా కలిసి శాలువాతో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బి.సదానందం ప్రేమనందం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలపై సమీక్ష

నవతెలంగాణ-బాల్కొండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరడంలో ఉన్న ఇబ్బందులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతు రుణమాఫీ ధరణి సమస్యలు, ఎంఎన్ఆర్ఈజీఎస్ పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత సిలిండర్, గృహ జ్యోతి, మన ఊరు మనబడి పనులు ఇతర అంశాలపై కలుగుతున్న ఇబ్బందులు వాటిని పరిష్కరించడంలో తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఆర్ అండ్ బి ఇరిగేషన్ పిఆర్ అధికారులతో గత ప్రభుత్వంలో మంజూరై నియోజకవర్గంలో సీడీపీ ఎస్‌డిఎఫ్ నిధులతో కొనసాగుతున్న పనులు, ప్రస్తుతం ప్రారభించవలసిన పనులపై ఇంజనీరింగ్ అధికారులు పూర్తి సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. శంకుస్థాపనలు వేయవలసిన పనులకు ఇంచార్జ్ మంత్రి అప్రోవల్ తీసుకొని పనులకు త్వరగా శంకుస్థాపన కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు. అనంతరం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఆర్మూర్ డిఎల్‌పిఓ, నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుని జన్మదిన వేడుకలు

● పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో బుధవారం బోధన్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అంతకుముందు ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మొక్కలు నాటారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు, పాఠశాలలో సౌకర్యాలు, సమస్యలపై ప్రధానోపాధ్యాయులు రమేష్ ను అడిగి ఎమ్మెల్యే ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంచినీటి సమస్య ఉందని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ తో మాట్లాడి బోరు మోటర్ వేయించేందదుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఏఆర్ క్యాంపు పాఠశాలలో ఆవరణంలో ఉన్న పురాతన పాఠశాలను కూల్చి వేసేందుకు



పులి శ్రీనివాస్‌రావుతో కేక్‌కట్‌చేయిస్తున్న ఎమ్మెల్యే

ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు తీర్మానం చేసి అట్టి కాపీని మండల విద్యాశాఖ అధికారి ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించినట్లయితే సహకారం అందిస్తానని అన్నారు. అంతకుముందు ఇండియన్ మెడికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జానకంపేట, వడ్డేపల్లి, కుర్నపల్లి, ఎడపల్లి గ్రామాలలో పులి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొంద్ర సంజయ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహర్ బిన్ ఉందాన్, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బిల్లా రామ్మోహన్, జడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గభాస్కర్ రెడ్డి, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాన్ని గుర్తించి కంచె ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ముప్కాల్

పంచాయతీ స్థలాన్ని గుర్తించి కంచె ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో బీజేపీ నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షులు గడ్డం సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ముప్కాల్ మండల కేంద్రంలో చెరువు శిఖం భూమి పక్కన ఉన్న వెంచర్ లో గ్రామపంచాయతీ కార్యాలయంకు వచ్చే 10శాతం భూమి ఎక్కడ ఉందో గుర్తించి ఆ స్థలంలో కంచె ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీ స్థలం ఎవరి పేరున ఉందో రికార్డుల పరంగా గుర్తించి తెలపాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు లేక పనులు ముందుకు సాగడం లేదన్నారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కేజీబీవీ పాఠశాల భవనం అద్దె భవనంలో కొనసాగుతున్నట్లు గుర్తుచేశారు. కేజీబీవీ విద్యార్థులు వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కారం చూసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు గడ్డం సంతోష్ రెడ్డి, ముస్కు నర్సయ్య, చిల్క దినేష్, మ్యాక నర్సయ్య, కల్లు స్వామి, లోక రాములు, కింగ్స్ గంగాధర్, మాజిత్, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

షరతులు, ఆంక్షలు లేకుండా జీవన భృతి చెల్లించాలి

బీడీకార్మికుల ర్యాలీ, ధర్నా

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వం బీడీ కార్మికులకు షరతులు, ఆంక్షలు లేకుండా ప్రతి ఒక్కరికి చేయూత పథకం ద్వారా 4వేల రూపాయల జీవన భృతి కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నరేందర్ స్పష్టం చేశారు. బుధవారం మండలకేంద్రంలో బీడీకార్మికులతో ర్యాలీ, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ మహిళలు తమకు చేయూత పథకం ద్వారా పింఛన్ రావాలని కోరగా, ఇట్టి విషయాన్ని లిఖితపూర్వకంగా జిల్లా కలెక్టర్ కు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్, డి, జిల్లా నాయకులు పుట్టినడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, వడ్డెన్న, ఎస్కే నసీర్, సిద్ధ పోశెట్టి, సంతోష్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.